
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
శుక్రవారం 18 అక్టోబరు 2024



రేపు అల్లాదుర్గంలో
సివిల్ కోర్టు ప్రారంభోత్సవం
పరిశీలించిన జిల్లా న్యాయాధికారి లక్ష్మీశారద
8
ఘనంగా వాల్మీకి జయంతి

గృహం.. గ్రహణం

'డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీపై అయోమయం
గత ప్రభుత్వ హయాంలో పెద్దసంఖ్యలో నిర్మాణం
ఉమ్మడి మెదక్ జిల్లాకు 26,635 ఇళ్లు
లబ్ధిదారులకు పంచినవి కొన్నే..
నిరుపయోగంగా ఇంకొన్ని..
అసంపూర్తిగా మరికొన్ని
పూర్తయిన ఇళ్లనూ పంపిణీ చేయని అధికారులు
గృహప్రవేశాలకు ముందే శిథిలమవుతున్న తీరు
కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా



చేగుంట మండలం బి.కొండాపూర్‌లో అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్లు

గత ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్ల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. కొన్నిచోట్ల మినహాయిస్తే దాదాపు డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయాల వద్ద అధ్వాన పరిస్థితులు ఉన్నాయి. నిర్మాణంలో లోపాలు, పంపిణీలో అవకతవకలు, కాంట్రాక్టర్ల అలకలు, అసంపూర్తిగా ఉన్న గృహాలు వెరసి సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నాయి. చకచకా పూర్తిచేసిన ఇళ్లను కూడా ఏళ్ల తరబడిగా పంపిణీ చేయకపోవడమే పెద్ద సమస్యగా మారింది. ఇక హడావిడిగా నిర్మాణాలను ప్రారంభించిన ఇళ్లు సైతం అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 26వేలకు పైగా ఇళ్లు మంజూరైతే దాదాపు 17 వేల ఇళ్లను పూర్తిచేసినట్లు చెబుతున్నారు. ఇందులో 16వేల ఇళ్ల వరకు పంపిణీ చేశామని అధికారులు పేర్కొంటున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి.

7

జిలా	మొత్తం ఇళ్లు	పూర్తయినవి	పంపిణీ చేసినవి
సిద్దిపేట	15,925	10,424	9,980
మెదక్	4,776	2,759	2,323
సంగారెడ్డి	5,934	4,194	4,146

'సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణ శివారులో 795 డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మొదటి దశలో 130 గృహాల నిర్మాణ పనులు పూర్తికాగా మిగితా పనులు పెండింగులోనే ఉన్నాయి. పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వడానికి లాటరీలో ఎంపిక ప్రక్రియ చేపట్టారు. కానీ వారికి ఇళ్ల పంపిణీ చేయలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో గత లబ్ధిదారులకే ఇస్తారా.. కొత్తవాళ్లను ఎంపిక చేస్తారా అనే అనుమానాలున్నాయి. ప్రస్తుతం ఇళ్లన్నీ అధ్వానస్థితికి చేరి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.'

'మెదక్ పట్టణంలోని పిల్లికొట్టాల వద్ద నిర్మించిన డబుల్‌బెడ్రూం కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. ఇక్కడ 950 ఇళ్ల నిర్మాణం చేపట్టగా.. 561 మాత్రమే లబ్ధిదారులకు అందజేశారు. మరో 100 ఇళ్ల నిర్మాణం పూర్తయినా పంపిణీ చేయడంలేదు. 289 ఇళ్లు వివిధ దశల్లో నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు జీఎస్టీ, నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిపివేశారు. నిధులు విడుదలైతే తప్ప పనులు పూర్తిచేసేలా కనిపించడం లేదు.'

'సిద్దిపేట జిల్లా తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లిలో 20 జీప్లస్-2 డబుల్‌బెడ్రూం ఇళ్లను నిర్మించారు. మొక్కుబడిగా లబ్ధిదారులను ఎంపికచేసి ఇళ్లను అందజేసి చేతులు దులుపుకున్నారు. ఇళ్లలో మరుగుదొడ్లను సరిగ్గా నిర్మించలేకపోవడంతో ఆరుబయటకు పోతున్నారు. విద్యుత్ కనెక్షన్ లేక స్తంభాలకు కొక్కేలు తగిలించుకుంటున్నారు. ఇదే మండలం బండారుపల్లిలో జీప్లస్-2 డబుల్ ఇళ్లు 20ను నిర్మించి ఆరేళ్లవుతున్నా లబ్ధిదారులకు పంపిణీ చేయనందున శిథిలావస్థకు చేరుతున్నాయి.'



తొగుట మండలం బండారుపల్లిలో పంపిణీ చేయకముందే శిథిలమవుతున్న డబుల్‌బెడ్రూం ఇల్లు



'సీఎంఆర్' ఇవ్వని మిల్లర్లపై కొరడా

రూ. 214 కోట్లు బాకీ వసూళ్లకు
రెవెన్యూ రికవరీ యాక్టు ప్రయోగం
మరో 64 మిల్లులకు రూ.8 కోట్లు ఫైన్

మెదక్, అక్టోబరు 17: ఇచ్చిన గడువు లోగా సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇవ్వని మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అనేకసార్లు గడువు పొడిగించినప్పటికీ రైస్‌మిల్లర్ల వైఖరిలో మార్పు రాకపోవడంతో.. బకాయిల వసూళ్లకు రెవెన్యూ రీకవరీ యాక్టు ప్రయోగిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 12 మంది మిల్లర్లు ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఇవ్వలేదు. అసలు తమ రైస్ మిల్లుల్లో నుంచి ఏకంగా ధాన్యాన్నే మాయం చేశారని అధికారులు గుర్తించారు. దీంతో పౌర సరఫరాల శాఖ అధికారులు దాన్యం ఎవరి పేరిట ఒప్పందం చేశారు, మిల్లర్లు ప్రభుత్వానికి పడ్డ బాకీ ఎంత తదితర వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటికే ఆ పన్నెండు మిల్లుల యజమానులు రూ.214 కోట్లు విలువైన బియ్యం ఎగ్గొట్టారని తేల్చారు. వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఇక ఆర్‌ఆర్ యాక్టు కింద చర్యలకు నివేదిక తయారుచేసే పనిలో పౌరసరఫరాల శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. జిల్లావ్యాప్తంగా 168 రైస్ మిల్లులు ఉండగా 104 మిల్లర్లకు మాత్రమే 2023-24 సీజన్‌లో ధాన్యం కేటాయింపులు జరిపారు. ఇందులో 64 మంది మిల్లు యజమానులపై సరైన యంత్రాలు లేకపోవడం, గోదాంలు లేకపోవడం, ప్రభుత్వానికి బియ్యం బాకీ పడడం తదితర కారణాలతో 25 శాతం అపరాధ రుసుము కింద రూ.8 కోట్లు ఫైన్ విధించామని అధికారులు తెలిపారు. అలాగే, ప్రభుత్వానికి సీఎంఆర్ ఎగవేసిన మిల్లులకు సంబంధించి ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరపవద్దని జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లకు లేఖలు రాశామని జిల్లా పౌర సరఫరాల శాఖ డీఎం హరికృష్ణ తెలిపారు. ప్రభుత్వానికి బకాయిపడ్డ బియ్యం, లేదా నగదు ముట్టజెప్పేంత వరకూ ఏలాంటి లావాదేవీలు జరపవద్దని సూచించినట్లు ఆయన వివరించారు.

దారి మార్చి.. ఏమార్చి..!

అయినా వదలని పోలీసులు

గంజాయి రవాణాపై సంగారెడ్డి జిల్లా పోలీసుల ఉక్కుపాదం
40కిలోల గంజాయి, 50 గ్రాముల హాష్ ఆయిల్ స్వాధీనం : వెల్లడించిన ఎస్పీ

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గంజాయి అక్రమ రవాణాపై సంగారెడ్డి జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. 40 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో 50 గ్రాముల హష్ ఆయిల్ స్వాధీనం చేసుకొని ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ రూపేష్ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా మనూరు మండలం దపూరు వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా నాగల్‌గిద్ద నుంచి నారాయణఖేడ్ వైపు వెళ్తున్న ఓ కారులో 40 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నారు. దీని విలువ దాదాపు రూ.4 లక్షలు వుంటుంది. ఈ కేసులో కర్నాటక రాష్ట్రం బీదర్ జిల్లా బాల్కి పట్టణం బిర్‌దేవ్‌కాలనీకి చెందిన మల్లగొండ (31)ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఓ దొంగతనం కేసులో బీదర్ జైలుకు వెళ్లగా అక్కడ రాహుల్ చక్రవర్తి అనే వ్యక్తితో పరిచయం అయ్యింది. అతడి సలహా మేరకు జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం పట్టణానికి చెందిన మల్లేష్‌తో కలిసి ఛత్తీస్‌గడ్ నుంచి గంజాయి రవాణా చేసేవాడు. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితులు మల్లేష్ యాదవ్, దాదాపాటిల్, రాహుల్ చక్రవర్తి కోసం గాలిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

గంజాయి కాకుండా హష్ ఆయిల్



పట్టుకున్న ఎండు గంజాయి, హష్ ఆయిల్‌ను చూపుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేశ్

గంజాయి రవాణా చేస్తుంటే పోలీసులకు పట్టుబడుతున్నామని స్మగ్లర్లు కొత్త ఎత్తుగడకు తెరలేపగా పోలీసులు చిత్తు చేశారు. అరకు నుంచి కొందరు వ్యక్తులు హష్ ఆయిల్‌ను తీసుకువచ్చి బీరంగూడలో విక్రయిస్తుండగా అమీన్‌పూర్ పోలీసులు పట్టుకున్నారు. 11 చిన్న డబ్బాల్లో ఉన్న 50 గ్రాముల హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.25వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో నిందితులు పటాన్‌చెరు మండలం ముత్తంగి కిర్బి కాలనీకి చెందిన దాసు సాయిశివ (26), అమీన్‌పూర్ పట్టణంలోని లక్ష్మీసాయి మెడోస్‌లో నివసిస్తున్న కోయిలకండ్ల అఖిలేష్ (26), అమీన్‌పూర్‌కు చెందిన మంద్రగుట్టి ప్రేమ్(27)లను అదుపులోకి తీసుకున్నారు. ఇదే కేసులో అరుకు చెందిన సుబ్బారావు, లింగంపల్లికి చెందిన శంకర్, జాయ్, బిలాల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో మాదక ద్రవ్యాలకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా 8712656777 నంబర్‌కు తెలపాలని ఎస్పీ కోరారు. విలేకరుల సమావేశంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ రమేష్, విజయకృష్ణ, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఎంపీ, నాయకులతో మంత్రి పొన్నం ప్రభాకర్

పార్టీ ఆఫీసులతో కార్యకర్తలకు ధీమా

- అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తాం
- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

జహీరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండేందుకు, కార్యకర్తలకు ధీమా ఇచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నట్టు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాలవారీగా కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ తమ ప్రభుత్వం నేరవేరుస్తుందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే రుణమాఫీ పూర్తి చేశామని, ఇంకా ఏదైనా కారణాలతో ఎవరైనా మిగిలిపోతే త్వరలోనే మాఫీ చేస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ డిపోలకు కొత్త బస్సులను ఇచ్చేందుకు కృషిచేస్తున్నారు. జహీరాబాద్ డిపోకు కూడా అవసరమైన కొత్తబస్సులను ఇచ్చేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి డా.చంద్రశేఖర్, మాజీ టీఎస్ఐడీసీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, కాంగ్రెస్ నాయకులు డా. సిద్ధం ఉజ్వల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మక్సూద్, రాంలింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కండెం నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దామోదర్‌పై పోలీసులకు మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదు

జోగిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మంత్రి దామోదర్ రాజనర్సింహపై అందోలు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ జోగిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గాంధీ ఆస్పత్రిలో మందుల కొరతపై విలేకరులు ప్రశ్నిస్తే.. 'మావాళ్లు, మీ వాళ్లు' అంటూ దురుసుగా మాట్లాడడంపై ఫిర్యాదు చేసినట్టు క్రాంతికిరణ్ పేర్కొన్నారు. అలాగే, ఐదు రోజుల క్రితం నియోజకవర్గంలోని అన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ల పదవులను రెడ్డి సామాజికవర్గం వారికే కేటాయించారంటూ వట్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నవీన్‌రెడ్డి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే.. ఓ కాంగ్రెస్ నాయకుడు ఆయనపై స్టేషన్లో ఫిర్యాదు చేశారని, పోలీసులు సదరు ఫిర్యాదుపై కనీస విచారణ కూడా జరపకుండానే కేసు నమోదు చేశారని క్రాంతికిరణ్ ఆరోపించారు. దామోదర్ తీరు, పోలీసుల తీరుపై తాను జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.



జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

సమస్యల వలయంలో
యూపీ హెచ్‌సీ
- ఓపీ స్లిప్పులు లేవు.. ఇంటర్నెట్ లేదు
- రోగులకు మంచినీరు దిక్కులేదు
- పనిచేయని సీసీ కెమెరాలు
- జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణ లేమితో అస్తవ్యస్తం
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, రోగులు

8



గాలిగోపురానికి పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గాలిగోపుర నిర్మాణానికి పూజ

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శివారులోని శ్రీవైకుంఠపురం ఆలయ గాలిగోపుర నిర్మాణానికి సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి శ్రీకారం చుట్టారు. ఆలయాన్ని గురువారం ఆమె దర్శించుకున్నారు. అనంతరం గాలిగోపుర నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు జిల్లా స్పెషల్ జడ్జి సునీతరవీందర్‌రెడ్డితో కలిసి ఆలయ ఆవరణలో గోశాలను ప్రారంభించారు. వచ్చే నెల 14వ తేదీ వరకు గ్రామాల్లో టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని, రైతులందరూ తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వసంతకుమారి, సహాయ సంచాలకులు రవీంద్రప్రసాద్, రాజేశ్వర్, ఆలయ ప్రధాన అర్చకులు వరదాచర్యులు తదితరులు పాల్గొన్నారు.

కారెట్ల నడిపిండో.. డ్రైవర్ రావాలి
- తూప్రాన్ ఆస్పత్రి వద్ద బంధువుల గొడవ
- మృతదేహాలను తరలించే ట్రాక్టర్ అడ్డగింత
- ఉద్రిక్తతల మధ్య శవాల అప్పగింత
- ముగిసిన అంత్యక్రియలు

7 లో





ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు

మెగాఫోన్ పట్టిన
మనోడు
- డైరెక్టర్‌గా చేర్యాలవాసి
- నేడు మొదటి సినిమా రిలీజ్
- లవ్‌రెడ్డి గుర్తుండిపోతుంది
- దర్శకుడు స్మరణ్‌రెడ్డి

7 లో

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

హవేళిఘణపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లుగా నమోదు చేసుకోవాలని మెదక్ కలెక్టర్, ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన ఓటరుగా నమోదు చేసుకున్నారు. అనంతరం ఓటరు నమోదు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి అర్హత కలిగిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. 2021 జనవరి నాటికి డిగ్రీ, తత్సమాన అర్హత కలిగిన పట్టభద్రులంతా అర్హులని తెలిపారు. ఇందుకోసం కార్యాలయాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటరు నమోదుకు నవంబరు 6 చివరి తేదీ అని వివరించారు. ఆయనవెంట తసీల్దార్ సింధురేఖ, డిప్యూటీ తసీల్దార్ నవీన్‌కుమార్ ఉన్నారు.



ఓటరు నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

'సమాజంలో పట్టభద్రులు కీలకం'



ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వి.నరేందర్‌రెడ్డి

హుస్నాబాద్ అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 17 : పట్టభద్రులు సమాజంలో కీలకంగా వ్యవహరిస్తారని, అభివృద్ధికి బాట వేస్తారని అల్ఫోర్స్ సంస్థల అధినేత, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజక వర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. హుస్నాబాద్‌లో గురువారం పట్టభద్రుల ఓటర్ నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బస్‌స్టేషన్ ఎదురుగా నమోదు కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు.







ఘనంగా వాల్మీకి జయంతి

మహర్షి వాల్మీకి జయంతిని గురువారం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరి క్రాంతి, మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిచారు.

- మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి)

చెరువులో చేపలు మృతి

హత్నూర, అక్టోబరు 17 : హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల భీముని చెరువులో చేపలు మృతి చెందాయి. గ్రామ మత్స్యకారులకు జీవనాధారమైన చేపలు మృతి చెందడం పట్ల వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ చెరువుకు పైభాగంలో ఉన్న తుర్కలాఖానాపూర్, చందాపూర్, బోర్పట్ల గ్రామ శివారులోని పరిశ్రమల కాలుష్య జలాలతోనే చేపలు మృతి చెందినట్లు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. పీసీబీ అధికారులు స్పందించి విచారణ అనంతరం పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సంగారెడ్డి పీసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.



భీముని చెరువులో మృతిచెందిన చేపలు

గృహం.. గ్రహణం

డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీపై అయోమయం


మెదక్ పట్టణంలోని పిల్లికొట్టాల వద్ద అసంపూర్తిగా డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం

- ఉమ్మడి మెదక్ జిల్లాకు 26,635 ఇళ్లు
- లబ్ధిదారులకు పంచినవి కొన్నే..
- నిరూపయోగంగా ఇంకొన్ని.. అసంపూర్తిగా మరికొన్ని
- పూర్తయిన ఇళ్లనూ పంపిణీ చేయని వైనం
- గృహప్రవేశాలకు ముందే శిథిలమవుతున్న తీరు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి,సంగారెడ్డి, అక్టోబరు 17 : కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహించారు. 2018లో పూర్తయిన ఇళ్లను కూడా ఇప్పటిదాకా అర్హులకు ఇవ్వలేదంటే అతిశయోక్తి కాదు. దీంతో ఆ ఇళ్లన్నీ పర్యవేక్షణ లేక శిథిలావస్థకు చేరుతున్నాయి. తలుపులు, కిటికీలు, విద్యుత్ మీటర్లు, మరుగుదొడ్లు, గోడలు ధ్వంసమవుతున్నాయి. ఇటు లబ్ధిదారులకు అందక, అటు అధికారుల పర్యవేక్షణలో ఉండక కొత్త ఇళ్లన్నీ పాడుబడిన భవనాలను తలపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ ఇళ్లపై దృష్టి పెట్టి అర్హులైన లబ్ధిదారులకు అందజేయాల్సిన అవసరం కనిపిస్తోంది. లేదంటే గత ప్రభుత్వం ఈ ఇళ్లపై వెచ్చించిన నిధులను దుర్వినియోగమే అవుతాయి.

డబుల్ ఇళ్లల్లో ట్రబుల్స్

- రామాయంపేటలో 305 ఇళ్లకు 250 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇళ్ల వద్ద డ్రైనేజీ పైపులైన్లు పగిలి దుర్గంధం వెదజల్లుతోంది. సరైన రోడ్లు లేక పొలాల మీదుగా భయపడుతూ వెళ్లాల్సిన పరిస్థితి.
- కొమురవెల్లి మండలం గౌరాయపల్లి శివారులో 20 ఇళ్ల నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు.
- శివ్వంపేట మండలం పిట్టలవాడ, దంతాన్‌పల్లి, దొంతి గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు సరైన రహదారులు, మురుగు కాలువలు లేవు. ఇళ్లలో మరుగుదొడ్లు సరిగ్గా లేక ఇబ్బంది పడుతున్నారు.
- ములుగు మండలం బస్వాపూర్, బండ మైలారం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉంది.
- నర్సాపూర్ పట్టణంలో 500 ఇళ్లు మంజూరు చేయగా 248 పూర్తయ్యాయి. మిగతా వాటిని అసంపూర్తిగా వదిలేశారు. పూర్తయిన ఇళ్లను కూడా ఇప్పటిదాకా లబ్ధిదారులకు అందజేయలేదు. ఎనిమిదేళ్లుగా పట్టణంలోని అర్హులు ఎదురుచూస్తున్నారు. 4 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు.
- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వగ్రామమైన చింతమడక, సీతారాంపల్లి, మాచాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. సీసీ రోడ్లు పూర్తిగా నిర్మించలేదు.
- జిన్నారం మండల కేంద్రంలో 60 ఇళ్లు, కొడకంచిలో 50 ఇళ్లు అసంపూర్తిగా నిలిచాయి. ఏ ఒక్క లబ్ధిదారుడికి పంపిణీ చేయలేదు.
- మనోహరాబాద్‌లో నిర్మించిన డబుల్ ఇళ్ల కిటికీలు, తలుపులను ధ్వంసం చేశారు. ఇవే ఇళ్లను పంపిణీ చేయగా లబ్ధిదారులు సైతం మరమ్మతులు చేసుకోకుండా వినియోగిస్తున్నారు.
- కొండాపూర్ మండల కేంద్రంతోపాటు తొగర్‌పల్లి, అలియాబాద్‌లో ఇళ్లను పంపిణీ చేయగా కొంతమంది అద్దెకు ఇచ్చినట్లు సమాచారం.
- అందోలు-జోగిపేటలో 380 డబుల్ ఇళ్లు, డాకూర్‌లో 59 ఇళ్లు నిర్మించి పంపిణీ చేశారు. కానీ ఈ ఇళ్ల వద్ద అంతర్గత రహదారులు నిర్మించలేదు.
- సదాశివపేట పట్టణ పరిధిలోని సిద్దాపూర్ కాలనీలో 554 ఇళ్లు నిర్మించారు. ఈ కాలనీలో అంతర్గత రోడ్లు లేవు. డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. 15 రోజులకోసారి తాగునీటిని అందిస్తున్నారు. 30 శాతం మంది అనర్హులకే కేటాయించారనే ఆరోపణలున్నాయి.
- చేగుంట మండలంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయకున్నా కొంతమంది వచ్చి నివాసం ఉంటున్నారు. ఎనిమిదేళ్లయినా పంపిణీ చేయడం లేదు. బి.కొండాపూర్‌లో ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి.
- అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. అయితే సౌకర్యాలు లేక సుమారు 50శాతం మంది ఇళ్లను ఖాళీ చేశారు.
- నిజాంపేట మండలం కల్వకుంట, నందిగామ, చల్మెడ గ్రామాల్లో 210 ఇండ్లు నిర్మించగా కేవలం నందిగామలోని 40 ఇళ్లను పంపిణీ చేశారు. చల్మెడ, కల్వకుంట గ్రామాల్లోని ఇళ్లు అధ్వానంగా మారుతున్నాయి.
- దుబ్బాక మండలం బల్వంతాపూర్‌లో లబ్ధిదారులను గుర్తించలేదు. దుబ్బాక పట్టణంలో నిర్మించిన 714 ఇళ్ల వద్ద నాణ్యత లోపించింది.
- సంగారెడ్డి మండల పరిధిలోని హనుమాన్‌నగర్‌లో నిర్మించిన డబుల్ ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వకపోవడంతో పిచ్చిమొక్కలు, ముళ్లపొదల నడుమ నిరూపయోగంగా మారాయి.


నారాయణఖేడ్‌లో డబుల్ బెడ్రూం ఇంటిలో మద్యం సీసాలు, నిజాంపేట మండలం కల్వకుంటలో పంపిణీ చేయకముందే ధ్వంసమైన కిటికీలు


ఫసల్‌వాది డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లోపంతో నిలిచిన మురికినీరు, కొమురవెల్లి మండలం గౌరాయపల్లిలో స్లాబ్ దశలోనే ఇళ్ల నిర్మాణం, సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లిలో డ్రైనేజీ, సీసీ రోడ్లు లేని ఇళ్లు, సదాశివపేట పట్టణ శివారులో వర్షానికి తడిసి దెబ్బతిన్న డబుల్ ఇళ్లు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- ఒకరికి గాయాలు


రాజీవ్ రహదారిపై వనిత మృతదేహం

వర్గల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై వెళ్తున్న తల్లికొడుకు వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొనగా తల్లి కిందపడగా మరో వాహనం ఆమె తలపై నుంచి వెళ్లడంతో మృతిచెందిన సంఘటన వర్గల్ మండలం గౌరారం రాజీవ్ రహదారిపై గురువారం చోటుచేసుకున్నది. గౌరారం ఎస్ఐ కరుణకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నాగపురం గ్రామానికి చెందిన బాలేష్ తన యాక్టివా బండిపై తల్లి వనితతో హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. గౌరారం వద్దకు చేరుకోగా మార్స్ ఇండియా పరిశ్రమ ఎదుట గుర్తుతెలియని వాహనం వెనుకవైపు నుంచి అతివేగంగా వచ్చి వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నది. వెనుక కూర్చొన వనిత కిందపడింది. అదే సమయంలో మరో వాహనం ఆమెపై నుంచి వెళ్లడంతో తలకు బలమైన గాయం కావడంతో వనిత అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అతివేగంతో అదుపు తప్పిన కారు.. ఒకరి దుర్మరణం


ఆస్పత్రిలో రాజేష్ మృతదేహం

కుకునూరుపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అతివేగంతో నడుపుతున్న కారు అదుపు తప్పడంతో ఒకరు మృతిచెందిన సంఘటన కుకునూరుపల్లి శివారులో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లికి చెందిన కార్వా రాజేష్(42) బుధవారం హైదరాబాద్ నుంచి బెల్లంపల్లికి వచ్చి కుటుంబసభ్యులను కలిసి అర్ధరాత్రి దాటిన తర్వాత హైదరాబాద్‌కి తిరుగు ప్రయాణమయ్యాడు. కారును అతివేగంగా నడపడంతో కుకునూరుపల్లి గ్రామ శివారులో మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఇనుప రాడ్‌ను ఢీకొట్టింది. అనంతరం ఆ పక్కనే ఉన్న మరో కారును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వృద్ధుడి ఆత్మహత్య


నాగయ్య మృతదేహం

తూప్రాన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : వృద్ధుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూ ప్రాన్ పట్టణంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణంలో నివాసముంటున్న ఉడత లక్ష్మి, నాగయ్య(75) దంపతులు పండ్ల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. బుధవారం రాత్రి దంపతులిద్దరు భోజనం చేసి వేర్వేరు గదుల్లో పడుకున్నారు. అర్ధరాత్రి సమయంలో ఉడత నాగయ్య ఇంటి తలుపులకు గడియపెట్టి బయట ఉరేసుకున్నాడు. అర్ధరాత్రి తరువాత లేచిన భార్య లక్ష్మి భర్త లేకపోవడంతో తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా, గడియపెట్టి ఉంది. పక్కన ఇంటివారికి తెలుపగా, గడియ తీయడంతో బయటకు రాగా నాగయ్య ఉరేసుకుని కనిపించాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

కారెట్ల నడిపిండో.. డ్రైవర్ రావాలి

తూప్రాన్ ఆస్పత్రి వద్ద రోడ్డు ప్రమాద మృతుల బంధువుల గొడవ

- మృతదేహలను తరలించే ట్రాక్టర్ అడ్డగింత
- ఉద్రిక్తతల మధ్య శవాల అప్పగింత
- ముగిసిన అంత్యక్రియలు


ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న బంధువులు, జగ్యాతండాలో మృతదేహాలను చూస్తు రోదిస్తున్న మహిళలు

తూప్రాన్/మెదక్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : 'కారెట్ల నడిపిండో.. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ నామ్‌సింగ్ రావాలి.. వచ్చిన తరువాతే శవాలను తీసుకెళ్తాం' అంటూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి బంధువులు తూప్రాన్ ప్రభుత్వాస్పత్రి వద్ద గొడవకు దిగారు. బుధవారం శివ్వంపేట మండలం ఉసిరకపల్లి వద్ద చోటుచేసుకున్న చెట్టును ఢీకొని పల్టీ కొట్టి మన్నెనోని వాగులోకి కారు దూసుకెళ్లిన ఘోర రోడ్డు ప్రమాదంలో శివ్వంపేట మండలంలోని పక్కపక్క తండాల్లో నివసించే ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మృతిచెందిన విషయం విదితమే. తాళ్లపల్లి తండాకు చెందిన ధనావత్ శివరాం, ఆయన భార్య దుర్గి, ఆయన కుమార్తె జగ్యాతండాకు చెందిన మాలోతు అనిత, ఆమె కూతుళ్లు హిందు, శ్రావణి, బీమ్లా తండాకు చెందిన గుగ్లోత్ శాంతి, ఆమె కూతురు మమత ప్రాణాలు వదలగా కారు నడుపుతున్న శివరాం అల్లుడు, శాంతి భర్త నామ్‌సింగ్ తీవ్రగాయాలతో బయటపడ్డాడు. అయితే, గురువారం మృతదేహాలకు తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆస్పత్రికి ధనావత్ శివరాం, మాలోత్ అనిత బంధువులు భారీగా చేరుకున్నారు. మాలోత్ మోహన్ భార్య, పిల్లలు మృతిచెందడంతో మోహన్ మేనమామ రమేష్, మరికొందరు ఆస్పత్రి వద్ద గొడవ చేశారు. ప్రమాదం జరిగినపుడు ఒక్కడే ఎలా బతికాడని, మిగతావారందరు ఎలా చనిపోయారని ప్రశ్నిస్తూ గొడవ చేశారు. నామ్‌సింగ్ వచ్చిన తరువాతే శవాలను తరలించాలని, మృతదేహాలను తరలించేందుకు తెచ్చిన ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. డ్రైవర్‌పై దాడికి ప్రయత్నించారు. పోలీసులు అతికష్టం మీదా సముదాయించి న్యాయం చేస్తామని, విచారణ చేయిస్తామని డీఎస్పీతో హామీ ఇవ్వడంతో తగ్గారు. ఉద్రిక్తతల మధ్య మృతదేహాలను బంధువులకు అప్పగించారు. తూప్రాన్ ఆస్పత్రికి పలువురు రాజకీయ నాయకులు విచ్చేసి కుటుంబీకులను పరామర్శించారు.

నామ్‌సింగ్ కొడుకు రాజేష్‌పై దాడికి యత్నం

శివ్వంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జగ్యా తండా, భీమ్లా తండా, తాళ్లపల్లి తండాల్లో బంధువుల రోదనల మధ్య, పోలీసుల పహారాలో అంత్యక్రియలను నిర్వహించారు. జగ్యా తండాలో అనిత, హిందూ, శ్రావణి అంత్యక్రియలకు వచ్చిన నామ్‌సింగ్ కొడుకు రాజేష్‌పై వారి బంధువులు దాడికి యత్నించారు. మీ తండ్రి చంపాడు అంటూ అనిత బంధువులు అతడిపైకి వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. అనిత భర్త మోహన్ భార్య, కూతుర్లు హిందూ, శ్రావణి మృతదేహాలను చూసేందుకు ధైర్యం చేయకపోవడం చూసి బంధువుల రోదనలు మిన్నంటాయి.

సొసైటీ లాభాల్లో రైతులకు 10 శాతం వాటా

- కొత్తవల్లి రైతుసేవా సహకార సంఘం చైర్మన్ త్యార్ల రమేష్


మాట్లాడుతున్న త్యార్ల రమేష్

పాపన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తవల్లి రైతు సేవా సహకార సంఘం లాభాల్లో రైతులకు 10 శాతం వాటా ఇస్తామని పాలకవర్గ చైర్మన్ త్యార్ల రమేష్ వెల్లడించారు. గురువారం కొత్తవల్లిలో నిర్వహించిన సొసైటీ మహాజన సభలో ఆయన మాట్లాడారు. 2023-24 సంవత్సరానికి రూ.2,47,54,000 నికర లాభం, రూ.75.81 లక్షల వ్యాపార లాభం వచ్చినట్లు చెప్పారు. రుణమాఫీ కింద 1017 మంది రైతులకు రూ.6,35,63,067 రాగా, వాటిని తిరిగి రైతులకు రుణంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. వివిధ లావాదేవీలను వెల్లడించారు. అసైన్మెంట్ భూముల్లో తీసుకున్న రుణాలకు రుణమాఫీ చేయాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్, ఫీల్డ్ ఆఫీసర్ యాదగిరి, సీఈవో వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి



- కొల్లం ఎంపీ, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ కేంద్ర కార్యదర్శి ఎన్‌కే ప్రేమచంద్రన్

పటాన్‌చెరు రూరల్, అక్టోబరు 17: జాతి భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని, యువత రాజకీయాల్లోకి రావాలని కొల్లం లోక్‌సభ సభ్యుడు, రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి ఎన్‌కె.ప్రేమచంద్రన్ పిలుపునిచ్చారు. చేంజ్‌మేకర్స్ పేరిట గీతం డ్రీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో గురువారం ఆయన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలు అంటే దేశానికి సేవ చేసే రంగంగా చూడాలని ఆయన అభిప్రాయపడ్డారు. కేరళలో తలెత్తిన కోకాకోలా ప్లాంట్ వివాదంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, పర్యావరణ సమస్యలు పారిశ్రామిక ప్రయోజనాల కోసం తరచుగా రాజీ పడటం, ముఖ్యంగా అట్టడుగు వర్గాలను ప్రభావితం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

20న ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో ఎంపికలు

పుల్‌కల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో జూనియర్స్ ఎంపికలు ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వై.మహేందర్‌రావు, సభ్యులు నాగరాజు, పోశప్పలు తెలిపారు. నర్సాపూర్ సమీపంలోని టీటీడబ్ల్యూఆర్ఎస్‌లో ఉదయం 9 గంటల నుంచి ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని వారు పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 43వ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనేందుకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని బాల, బాలికల విభాగంలో ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 18 ఏళ్లలోపు వారై ఉండాలని, వయస్సు, ఎత్తు, బరువు కలిపి 250 పాయింట్లకు మించకూడదని వారు తెలిపారు.

ముగిసిన కళా ఉత్సవ్ పోటీలు


కళా ఉత్సవ్‌లో గెలుపొందిన విద్యార్థులు

మెదక్ అర్బన్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులుగా మెదక్ పట్టణంలోని వెలుగు బాలికల పాఠశాలలో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఆరు విభాగాల్లో ప్రథమ స్థానం పొందిన ఆరుగురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

వాయిద్యాల పోటీల్లో అఖిల్(న్యూ హైస్కూల్, మెదక్), కథా కథనం పోటీల్లో అర్పిత(చందంపేట), నృత్య పోటీల్లో ఐశ్వర్య గ్రూప్(రత్నటెక్నో స్కూల్, మెదక్), డ్రామా పోటీల్లో సింధుగ్రూప్(సిద్ధార్థ మోడల్ స్కూల్, మెదక్), పాటల పోటీల్లో జీవన్(ట్రైబల్ వెల్ఫేర్, నర్సాపూర్), చిత్రలేఖనం పోటీల్లో రుచిత(మోడల్ స్కూల్, చిన్నశంకరంపేట) ఎంపికైయ్యారు.

మెగాఫోన్ పట్టిన మనోడు


స్మరణ్‌రెడ్డి

- డైరెక్టర్‌గా చేర్యాలవాసి
- నేడు మొదటి సినిమా రిలీజ్
- లవ్‌రెడ్డి గుర్తుండిపోతుంది : స్మరణ్‌రెడ్డి

చేర్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : చేతిలో బంతి, బ్యాట్ పట్టుకుని క్రికెటర్ అవ్వాలని అడుగులు వేసినప్పటికీ తనకంటూ ప్రత్యేకత చాటుకోవాలని, తనలో ఉన్న నైపుణ్యాన్ని వైవిధ్యంగా చూపాలని సినీ ఫీల్డ్‌కు పయనమై మెగాఫోన్ పట్టుకుని యాక్షన్, కట్ అని చెప్పడం ప్రారంభించాడు. సినీరంగంలో గాడ్‌ఫాదర్‌లు ఎవరూ లేకపోవడంతో గ్రామీణ ప్రాంత నేపథ్యం కలిగిన మనకెందుకురా సినిమాల పిచ్చి అని సూచించినప్పటికీ తానేంటూ నిరూపించుకోవాలన్న కసితో ముందుకుసాగాడు. దర్శకుడు అయ్యాడు.. సిద్దిపేట చేర్యాల మండలం గుర్జకుంట గ్రామానికి చెందిన స్మరణ్ రెడ్డి. ఆయన తీసిన లవ్‌రెడ్డి సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ విషయమై ఆంధ్రజ్యోతితో ఆయన విషయాలను పంచుకున్నాడు.




'మాది చేర్యాల మండలం గుర్జకుంట గ్రామం. తండ్రి పుర్మ రాంభూపాల్‌రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ అరుణ గృహిణి. నేను, మా చెల్లెలు సాఫ్ట్వే. వ్యవసాయాధార కుటుంబమే అయినప్పటికీ మా తండ్రి వృత్తి రీత్యా చేర్యాలలో స్థిరపడ్డాం. చిన్ననాటి నుంచి నాకు క్రికెట్ అంటే మక్కువ. క్రికెటర్ అవ్వాలని ఎంతగానో ఆశించాను. మా తండ్రి హైదరాబాదు, ఇతర ప్రాంతాల్లో స్పోర్ట్స్ అకాడమీల చుట్టూ తిప్పాడు. నేను హైదరాబాదులో బీటెక్ చదువుతున్న సమయంలో ఆర్య సినిమా రిలీజ్ అయింది. దర్శకుడు సుకుమార్ కొత్తదనంతో తీసిన ఈ సినిమాను చూసి చాలా ఇన్‌స్పైర్ అయ్యాను. హైదరాబాదులోని మధు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూషన్‌లో చేరాను. సంవత్సరం పాటు గ్రాడ్యుయేషన్ ఫిల్మ్ కోర్స్ నేర్చుకున్నాను. అవకాశాల కోసం వెతుకుతున్న సమయంలో దర్శకురాలు నందినిరెడ్డి వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరాను. అలా మొదలైంది.. కల్యాణవైభోగమే సినిమాలకు పనిచేశాను. రుద్రమదేవి సినీ రైటర్ రాజసింహతో పాటు పలువురి వద్ద పనిచేశాను. ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులో ఓ ప్రేమజంట ఎదుర్కొన్న పరిస్థితుల యదార్థగాథ విని లవ్‌స్టోరీతో పాటు ఫ్యామిలీ డ్రామా, సెంటిమెంట్‌తో కూడిన కథ రాసుకున్నాను. నిర్మాతలకు చెప్పగానే కథ నచ్చి ఒప్పుకున్నారు. చాలారోజుల క్రితమే షెడ్యూల్ ప్రారంభించినప్పటికీ కరోనాతో ఆలస్యమైంది. షూటింగ్ చివరి దశలో ఉన్న సమయంలో మాతండ్రి రాంభూపాల్‌రెడ్డి అనారోగ్యానికి గురై మరణించడంతో డిప్రెషన్‌కు గురికాగా అమ్మ, చెల్లె ప్రోత్సహించారు. కర్ణాటకలో 40 థియేటర్లు, తెలంగాణ, ఏపీలలో 80 థియేటర్లలో సినిమా రిలీజ్ చేస్తున్నారు. ముందస్తుగా హిందూపూర్‌లో షో వేయగా మంచి టాక్ వచ్చింది. నేడు రిలీజ్ అవుతున్న సందర్భంగా ఎంతో ఎంగ్జైటింగ్‌గా ఉంది. ఏదో లవ్‌స్టోరీలే అని అనుకుంటూ థియేటర్‌లోకి వెళ్లినప్పటికీ గుండెనిండా బరువుతో మంచి సినిమా చూశామంటూ బయటకు వస్తారు. పక్కాగా గుర్తుండిపోతుంది. మంచి ప్రేమకథా చిత్రం లవ్‌రెడ్డిని అందరూ తప్పక ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను.'

సమస్యల వలయంలో యూపీహెచ్‌సీ

ఓపీ స్లిప్పులు లేవు.. ఇంటర్నెట్ లేదు

- రోగులకు మంచినీరు దిక్కులేదు
- పనిచేయని సీసీ కెమెరాలు
- జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణ లేమి
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, రోగులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నది. ఓ వైపు రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్ లేకపోవడం.. మరోవైపు కనీస సౌకర్యాల లేమితో ఇటు ఆస్పత్రి వైద్య సిబ్బంది.. అటు రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



యూపీహెచ్‌సీలో ఓపీ స్లిప్పుగా మారిన చిన్న కాగితం


పనిచేయని సీసీ కెమెరాలు

సమస్యలివి..

ఈ యూపీహెచ్‌సీలో నిత్యం 120 మంది వరకు పేషెంట్లు వైద్యసేవలు పొందుతుంటారు. మెడికల్ ఆఫీసర్‌తో పాటు సుమారు 15 మంది వైద్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. ఇక్కడ డిప్యూటేషన్‌పై వచ్చిన ఓ మెడికల్ ఆఫీసర్ రెండునెలలుగా సెలవుల్లో ఉన్నది. అప్పటి నుంచి ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్) రోగులకు వైద్య సేవలందిస్తూ వస్తున్నారు. నిర్దేశిత ఓపీ స్లిప్పుల కొరత రెండునెలలుగా ఏర్పడడంతో చిన్నపాటి తెల్లకాగితాల్లోనే మందులు రాసి ఓపీ స్లిప్పులుగా వాడుతున్నారు. పైగా ఇంటర్నెట్ లేదు. ఏమైనా అవసరముంటే దగ్గరలోని మరో యూపీహెచ్‌సీ లేదా బయటికి వెళ్లి పనిచేసుకోవాల్సిందే. సీసీ కెమెరాలు నిర్వహణ అటకెక్కింది. కనీసం రోగులు తాగేందుకు మంచినీరు దిక్కులేదు. వీటన్నింటికీ రెగ్యులర్ మెడికల్ ఆఫసర్‌తో పాటు బడ్జెట్ లేదనే దాటవేత ధోరణి వినిపిస్తున్నది.


సంగారెడ్డి ఇంద్రనగర్‌లోని యూపీహెచ్‌సీ

నెలకిందటే నిధులు మంజూరు

జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలకు డెవలప్‌మెంట్ ఫండ్ కింద(హెచ్‌డీఎస్) నెలకిందటే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రూ.25 వేలు జమచేసింది. ఈ నిధులను ఆరోగ్య కేంద్రాల నిర్వహణ, ఇతరత్రా అత్యవసర అవసరాల నిమిత్తం ఖర్చు చేసుకోవచ్చు. ఆ దిశగా చర్యలు మాత్రం కనిపించడం లేదు. ఇదే విషయమై తాత్కాలిక మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ డా.గాయత్రీని వివరణ కోరగా... ఇక్కడ పనిచేసిన మెడికల్ ఆఫీసర్ సెలవుల్లో ఉన్నారన్నారు. యూపీహెచ్‌సీలో సమస్యలు ఉన్న మాట వాస్తవమేనని, బడ్జెట్ విషయాలు తనకేమీ తెలియదని చెప్పుకొచ్చారు. దీంతో జిల్లావ్యాప్తంగా పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలపై జిల్లా వైద్యాధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌వోల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● 11 గ్రాముల బంగారం, రూ.40 వేల నగదు అపహరణ

వెల్దుర్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దొంగలు చొరబడి నగదు, బంగారం, వెండి ఎత్తుకెళ్లారు. వెల్దుర్తి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బొడ్డు అంజయ్య భార్య యాదమ్మ మంగళవారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు తాళం పగులగొట్టి బీరువాలోని 11 గ్రాముల బంగారం, రూ.40 వేల నగదు, 5 గ్రాముల వెండిని అపహరించారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ రాజు, క్లూస్‌టీమ్ సిబ్బంది పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధితుడు అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


బీరువాలో ఉన్న బట్టలను కింద పడేసిన దొంగలు

సీఎంఆర్‌ఎఫ్ అందజేత

నారాయణఖేడ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కల్హేర్ మండలం మార్డికి చెందిన కాశీరాం అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధి ద్వారా రూ.60 వేలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును ఎన్‌ఆర్‌ఐ, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చేందర్, కాశీరాం కుటుంబీకులకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ జలందర్, ఫౌండేషన్ ప్రతినిధులు చెన్నారెడ్డి, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, బీఆర్‌ఎస్ నాయకులు సంగన్న, అంజయ్య, రాజు, శ్రీకాంత్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న మశ్చేందర్

'గీత కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి'

నారాయణఖేడ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్ కోరారు. గురువారం ఖేడ్‌లో నిర్వహించిన డివిజన్ స్థాయి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా గీత కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. శుక్రవారం హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం పదేళ్ల ప్రయాణం పేరిట రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని కల్లుగీత కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భవానీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు

పెద్దశంకరంపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అశ్వయుజ శుక్లపక్ష పౌర్ణమిని పురస్కరించుకుని పెద్దశంకరంపేటలోని భవానీమాత ఆలయంలో అమ్మవారి అభిషేకం, నవగ్రహపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనము, అమ్మవారి కలశ స్థాపన, చండీహోమం తదితర పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు ఆర్‌ఎస్.శ్రీనివాస్, శివకుమార్, ఆర్‌ఎన్.సంతోష్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు కళాశాలకు రాకపోతే ఫీజు తీసుకోం

వెల్దుర్తి, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతిరోజు కళాశాలకు హాజరుకాకపోతే వార్షిక పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజును తీసుకోమని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వెల్దుర్తి, అరెగూడెం, బస్వాపూర్, కుకునూర్ గ్రామాలకు చెందిన కళాశాలకు ప్రతిరోజూ రాని విద్యార్థుల ఇంటికెళ్లి పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో రవాణశాఖ సేవలు ప్రారంభం

నారాయణఖేడ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఖేడ్‌లో గురువారం నుంచి రవాణశాఖకు సంబంధించిన సేవలు ప్రారంభమయ్యాయి. పలు వాహనాలు ఫిట్‌నెస్ కోసం రాగా.. ధ్రువపత్రాలు, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎంవీఐ వెంకటయ్య నిబంధనల మేరకు ఫిట్‌నెస్ జారీచేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్ నర్సింహులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తాహెర్‌అలీ ఎంవీఐని కలిసి సేవలను ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంవీఐ మాట్లాడుతూ ప్రతి గురువారం ఇక్కడ ఫిట్‌నెస్, డ్రైవింగ్ టెస్టు, కొత్త ఆటో రిక్షాల రిజిస్ట్రేషన్, లెర్నింగ్ లైసెన్సుల జారీ సేవలు మాత్రమే అందిస్తామన్నారు.

పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సూర్‌రెడ్డి

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వట్‌పల్లి మండలం ఉసిరికపల్లి గ్రామానికి చెందిన బిగిలి సూర్‌రెడ్డి నియమితులయ్యారు. సూర్‌రెడ్డి 2006 నుంచి సంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాద వృత్తిలో కొనసాగుతుండగా 2024 అక్టోబరు 15 నుంచి పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సూర్‌రెడ్డిని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వీట్ తినిపించి, అభినందించారు.


సూర్‌రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు

● సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి


పరశురాముడి విగ్రహావిష్కరణలో గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఉజ్వల్‌రెడ్డిలను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

జహీరాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని చిరాగ్‌పల్లిలో గల భవానీమాత ఆలయంలో పరశురాముడి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ ఆలయాల్లో చేపట్టే ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతకు దోహదపడుతాయన్నారు. అందులో భాగంగా వారు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు పొందారు.

ఘనంగా భూమినాథ్ మహరాజ్ వర్ధంతి

చిన్నశంకరంపేట, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అనంత పద్మనాభ స్వామి పీఠాధిపతి భూమినాథ్ మహరాజ్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్‌గౌడ్ మహరాజ్ ఆధ్వర్యంలో పద్మనాభస్వామి గుట్ట వద్ద గణపతి పూజ, కుంకుమార్చన, భూమినాథ్ పాద పూజలు నిర్వహించారు. భక్తులు కోలాటాలు, భజనల మధ్య భూమినాథ్ పల్లకీసేవ ఊరేగింపు నిర్వహించారు.

విధుల్లో చేరిన విద్యుత్ అధికారులు

జోగిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో బదిలీల నేపథ్యంలో కొత్త సిబ్బంది విధుల్లో చేరుతున్నారు. జోగిపేటలోని విద్యుత్‌శాఖ కార్యాలయానికి బదిలీపై వచ్చిన బదిలీపై వచ్చిన అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నాగరాజు ఉన్నతాధికారుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ జేఏవోగా పనిచేసిన ఆయన ప్రమోషన్‌పై సంగారెడ్డికి బదిలీ కాగా, ప్రస్తుతం తిరిగి జోగిపేటకు వచ్చారు.


విధుల్లో చేరుతున్న అకౌంట్స్ ఆఫీసర్

హైకోర్టు జడ్జి పర్యటనకు ఏర్పాట్లు

పాపన్నపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ఏడుపాయల ఆలయం వద్ద అన్నిఏర్పాట్లు చేయాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. శనివారం హైకోర్టు న్యాయమూర్తి ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకోనున్న సందర్భంగా ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆమె వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌ఐ నాగరాజు ఉన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌కు సన్మానం

హత్నూర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్‌గా నియమితులైన చిలుముల సుహాసినిరెడ్డిని హత్నూర మండలం దౌల్తాబాద్‌కు చెందిన పీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎం.ఏ.హకీం తన కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జిన్నారం,అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బొల్లారం మున్సిపాలిటీలోని మల్లన్న బస్తీలో రూ.49.80 లక్షలతో, ఓల్డ్ విలేజ్‌లో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారి పనులకు చైర్‌పర్సన్ రోజారాణి, మున్సిపల్ కౌన్సిలర్లు వేణుపాల్‌రెడ్డి, శ్రీకాంత్ శంకుస్థాపనలు నిర్వహించారు. కమిషనర్ మంగతాయారు, ఏఈ పాల్గొన్నారు.

20న ఖోఖో జూనియర్ ఎంపికలు

నర్సాపూర్: నర్సాపూర్ టీటీడబ్ల్యూఆర్‌ఎస్‌లో 20న ఉమ్మడి జిల్లా ఖోఖో క్రీడల ఎంపికలు నిర్వహిస్తామని మెదక్ జిల్లా అడ్‌హక్ కన్వీనర్ వై.మహేందర్‌రావు తెలిపారు. 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 43వ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి మెదక్ జిల్లా బాల, బాలికల విభాగంలో ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులు 18 ఏళ్లలోపు వారై ఉండాలన్నారు.

'మూఢ నమ్మకాల పేరిట దాడులు అవివేకం'

రామాయంపేట: మంత్రాల పేర మనుషులపై దాడులు, హత్యలు చేయటం అవివేకమని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్ యువతకు ఉద్బోధించారు. గురువారం రామాయంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మూఢనమ్మకాలు లేవంటూ పలు రకాల ప్రయోగాలు చేసి చూపారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

చిన్నశంకరంపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని బీజేపీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని అయా గ్రామాల బూత్ లెవల్ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఇందిరమ్మ కమిటీ ఏర్పాటులో మార్గదర్శకాలు పాటించండి

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో మార్గదర్శకాలు పాటించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు గురువారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అన్నివర్గాల ప్రజలతో చర్చించిన తరువాతే ఇందిరమ్మ కిమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో మాజీ జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, గుండు సత్యనారాయణ ఉన్నారు.


అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కమిటీలు ఏర్పాటు చేయాలి: బీజేపీ

కౌడిపల్లి, సెప్టెంబరు 17: గ్రామ కమిటీల ద్వారానే ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గ్రామసభలు నిర్వహించకుండా మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన వారి పేర్లతో కమిటీ ఏర్పాటు చేయడంపై గురువారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

పేదల సంక్షేమం కోసమే ఇందిరమ్మ కమిటీలు

కొల్చారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు పూర్తయ్యాయని పేర్కొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

కోహీర్/కంగ్టి/మనూరు/నాగల్‌గిద్ద/తూప్రాన్/రేగోడు/కొల్చారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోహీర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో రామాయణ కర్త వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి తహసీల్దార్ బాలశంకర్, రెవెన్యూ సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. గొటిగార్‌పల్లి గ్రామంలో కూడా వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ రాచయ్య గ్రామ పెద్దలు పాల్గొన్నారు. మండల కేంద్రమైన కంగ్టిలతో పాటు తడ్కల్, నాగూర్, గాజుల్‌పాడ్, తుర్కవడగాం గ్రామాల్లో, మనూరు మండలం తిమ్మాపూర్‌లో, వట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో, నాగల్‌గిద్ద మండల పరిధిలోని పలు గ్రామాల్లో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద గురువారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయచంద్రారెడ్డి, కార్యాలయ సిబ్బంది, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బొలంపల్లి బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రేగోడు తహసీల్దార్ కార్యాలయంతో పాటు మర్పల్లి గ్రామం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొల్చారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గఫార్‌మియా ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు.


గొటిగర్‌పల్లి గ్రామంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

చెత్త కుప్పలో హనుమాన్ విగ్రహం

రామాయంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి తన ఇంటి పరిసరాల్లో ఉన్న హనుమాన్ విగ్రహాన్ని పెకిలించి చెత్త కుప్పలో పడేశాడు. ఈ ఘటన గురువారం మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి రాయిలాపూర్‌లో జరిగింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. సదరు వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే గ్రామానికి వెళ్లి ఇందుకు కారణమైన వ్యక్తిని పట్టుకొచ్చారు. స్టేషన్‌కు చేరుకున్న గ్రామ పెద్దలు తిరిగి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠ చేసేలా తీర్మానించారు. ఆ వ్యక్తి పోలీసుల సమక్షంలో ఒప్పుకోగా సమస్య సద్దుమణిగింది.

రోడ్డుకు మోక్షం

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సంగారెడ్డి మండలం ఇరిగిపల్లికి వెళ్లే రోడ్డు కొట్టుకుపోయి గుంతలమయంగా మారింది. అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో యువత నడుం బిగించారు. ఒక్కొక్కరు రూ.5 వేల నుంచి 10 వేల వరకు చందాలు వేసుకుని మొరంతో రోడ్డును బాగు చేసుకున్నారు.


మొరం వేయించుకుంటున్న యువకులు

నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ చేయాలి: ఎస్పీ

మునిపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ చేసి బాధితులకు అండగా ఉండాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా గురువారం మునిపల్లి(బుదేరా) పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ ఆవరణ, సిబ్బంది ఉండే బ్యారక్ పరిశుభ్రత, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ.సంజీవ్‌రావు, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, కొండాపూర్-మునిపల్లి సీఐ చంద్రయ్య, మునిపల్లి ఎస్‌ఐ రాజేష్ నాయక్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి: ఆర్డీవో

అల్లాదుర్గం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధరణిలోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అధికారులను ఆదేశించారు. అల్లాదుర్గంలో ప్రారంభంకానున్న సివిల్ కోర్టును గురువారం సందర్శించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

గానుగాపూర్‌లో దత్తాత్రేయుడిని దర్శించుకున్న 'పొన్నం'


పొన్నంతో కలిసి పూజలు చేస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శరత్ పౌర్ణమిని పురస్కరించుకుని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి కర్ణాటకలోని గానుగాపూర్ దత్తాత్రేయుడిని గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మందిరంలో నిర్వహించిన హోమంలో పొన్నం ప్రభాకర్, సురేష్‌షెట్కార్ సతీసమేతంగా పూజలు నిర్వహించారు. వారికి ఆలయ కమిటీ వారు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

స్వచ్ఛంద సంస్థల చేయూత అవసరం


విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, అక్టోబరు 17: ప్రభుత్వ బడుల్లో చదివే పేదల పిల్లలకు స్వచ్ఛంద సంస్థల చేయూత అవసరమని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం సేవోద్గం ఫౌండేషన్ ప్రతినిధులు జయశ్రీ, చంద్రశేఖర్, కార్తీక్‌ల సహకారంతో రూ.4 లక్షలతో సమకూర్చిన స్కూల్ బ్యాగులను గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ పాల్గొన్నారు.

స్కావెంజర్లను నియమించాలి: పీఆర్టీయూ


కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ

మెదక్ అర్బన్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ కోరారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం గురువారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ ఈ నెలలోపు స్కావెంజర్ల నియామకం చేపడుతామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యనాయక్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

విజయరామరాజు సేవలు మరువలేనివి

పెద్దశంకరంపేట, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన మాజీ జడ్పీటీసీ విజయరామరాజు సేవలు మరువలేనివని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్కాపూర్‌లో నిర్వహించిన సంతాప కార్యక్రమంలో పాల్గొని విజయరామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు. గురువారం చేగుంట మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ, సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆరుగాలం పండించిన పంటను దళారుల చేతిలో పెట్టి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకుని మద్దతు ధర పొందాలన్నారు. అనంతరం చందాయిపూట్‌లోని వీరాంజనేయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చేగుంటలోని హైవే బ్రిడ్జి వద్ద ఏర్పడిన గుంతలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయనవెంట నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ దుబ్బాక డీఈ వెంకటేశం, జీఎంఆర్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, మెదక్ ఆర్‌అండ్‌బీ డీఈ సర్దార్‌సింగ్ ఉన్నారు.

●రేగోడు: రేగోడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాయికోడ్ టీపీసీసీ మెంబర్ మున్నూరు కిషన్ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో సీతారావమ్మ, ఏపీఎం సంగీత, నాయకులు పాల్గొన్నారు.

●అల్లాదుర్గం: మండలంలోని రాంపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మల్లయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో శంకర్‌యాదవ్, ఐకేపీ ఏపీఎం నాగరాజు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డితో కలిసి ప్రారంభించారు.

●మునిపల్లి: మండల పరిధిలోని పెద్దచెల్మెడ పీఏసీఎస్‌లో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని పెద్దచెల్మెడ పీఏసీఎస్ చైర్మన్ దుర్గయ్య, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్ సంజీవరెడ్డి, పీఏసీఎస్ కార్యదర్శి శివారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.


చేగుంట మండలం మక్కరాజిపేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

రేపు అల్లాదుర్గం సివిల్ కోర్టు ప్రారంభోత్సవం

● కోర్టును పరిశీలించిన జిల్లా న్యాయాధికారి లక్ష్మీశారద

అల్లాదుర్గం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అల్లాదుర్గం సివిల్ కోర్టు ఈ నెల 19న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా గురువారం సాయంత్రం జిల్లా న్యాయాధికారి లక్ష్మీశారద, సబ్ జడ్జి జితేందర్, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రీటాలాల్ చంద్ర కోర్టును సందర్శించారు. పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు అందజేశారు. కొన్ని పనుల్లో లోపాలు ఉండడంతో సవరించాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌చంద్రగౌడ్, న్యాయవాది కొక్కొండ శ్రీనివాస్, అశ్వినికుమార్, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సీఐ రేణుకా, తహసీల్దార్ మల్లయ్య, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.


కోర్టును పరిశీలిస్తున్న లక్ష్మీశారద

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి: తపస్

చేగుంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని తపస్ జిల్లా కార్యదర్శి చల్లా లక్ష్మణ్ అన్నారు. గురువారం చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రారంభించారు. రాబోయే ఎన్నికల్లో తపస్ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. తపస్ మండలాధ్యక్షుడు రావుల వెంకటేశ్, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, రాజేశ్వర్, భవాని, శ్రీవాణి, రమాదేవి, రమ, ఉమాదేవి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.